# మృత్యుంజయుడు

మృత్యుంజయుడు అతని అసలు పేరు కాదు. అతని పేరు ప్రహ్లాదరావు. కాని-అతను మృత్యుంజయుడిగానే చాలామందికి తెలుసు. ప్రహ్లాదరావు- మృత్యుంజయుడుగా పేరు పొందటానికి కొన్ని సంఘటనలు దోహదం చేశాయి.

అతనికి పన్నెండేళ్ళ వయసున్నప్పుడు తోటిపిల్లలతో కలిసి ఓరోజు చెరువుకి స్నానానికి వెళ్ళాడు. ఈత వచ్చిన వాళ్ళందరూ చెరువులోదూకి ఈతకొడుతుంటే ప్రహ్లాదరావు ఒక్కడే ఒడ్డునకూర్చుని చొక్కా లాగులకు కాపలా కాస్తున్నాడు. తర్వాత అతనికి ఈత నేర్పుతాను రమ్మన్నాడు ఓ మిత్రుడు. బట్టలు విప్పి నీళ్ళలోకి దూకాడు ప్రహ్లాదరావు. కొంత సేపు నేర్చుకుని ఈత వచ్చిందనుకుని మరికొంచెం లోతుకు వెళ్ళాడు. అంతే, ఆ తర్వాత అతను కనిపించలేదు. ఎక్కడో తేలితే అతికష్టంమీద ఒడ్డుకు లాక్కొచ్చారు మిత్రులు.

అతని స్థితిచూసిన ఆయుర్వేద వైద్యుడు ప్రహ్లాదరావు బతకడని పెదవి విరిచాడు. కాని ప్రహ్లాదరావు బతికాడు అదే ఆశ్చర్యం. వైద్యుడు విస్తుబోయాడు. "వీడు మృత్యుంజయుడు తల్లీ" అన్నాడు అతని తల్లితో. నిజమేననిపించింది.

ఆతర్వాత మరోసారి పిట్ట గోడల్లేని డాబామీద గాలిపటాన్ని ఎగరవేస్తూ పైనించి పడిపోయాడు కిందకు. తల పగిలింది. అంతా

అతను చచ్చిపోయాడనుకున్నారు. కాని అతను మృత్యువును జయించి నట్టు బతికి అందరినీ ఆశ్చర్యంలో ముంచాడు.

ఇరవై రెండేళ్ళ వయసులో ప్రహ్లాదరావు ఓ ఇంటర్వ్యూ నిమిత్తమై ఓ రైల్లో వెళుతుండగా ఓ వంతెన దగ్గర ఆ రైలుకు యాక్సి డెంటయ్యింది. ఎంతోమంది అసలు గమ్యానికి కాకుండా వేరే గమ్యా నికి చేరారు. చచ్చిన వాళ్ళమధ్య లేచి కూర్చున్నాడు ప్రహ్లాదరావు.

ఈ వార్తను 'మృత్యుంజయుడు' అన్న హెడ్డింగ్‌లో చాలా పత్రికలు ప్రచురించేయి.



ఈ సంఘటనలన్నీ ప్రహ్లాదరావుని మృత్యుంజయుడిని చేశాయి.

కాని- ఈసారే మృత్యుంజయుడు మృత్యువును ఎదిరించలేనట్టు చచ్చిపోయేడు. మృత్యుంజయుడు మరణవార్త విని చాలామంది ఆశ్చ ర్యానికి లోనయ్యారు. కొంతమంది నమ్మలేదు. అలా నమ్మనివాళ్ళు అతని శవాన్ని చూసిన తర్వాత నమ్మకుండ వుండలేకపోయారు.

తల ఒకవైపు నుజ్జుగా చితికిపోయింది. ముఖమంతా గుండెల మీద నెత్తురు. అతని మీదగా పోయిన లారీ ఆగకుండానే వెళ్ళి పోయింది. ఆ రాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత గవర్న

మెంటు హాస్పిటల్ ముందు మృత్యుంజయుడు లారీకిందపడిన దృశ్యాన్ని ఎవరూ చూడలేదు. అంత రాత్రివేళ అతను హాస్పిటల్లో తను వార్డు నుంచి ఎందుకు బయటకు వచ్చాడో కూడా ఎవ్వరికీ అంతుబట్టలేదు. అంతా మృత్యుంజయుడు లారీ యాక్సిడెంట్ లో చనిపోయాడనుకున్నారు.

కాని- అసలు జరిగిందేమిటంటే-

ఆరోజు ఉదయం పదిగంటల సమయంలో నాలుగేళ్ళ దాటుతున్న కొడుకుని తీసుకొని మృత్యుంజయుడి దగ్గరకు వచ్చింది, అతని భార్య కుముదిని. దాదాపు వారం రోజుల్నించీ ఆమె అదే రైముకి కారియర్ తీసుకుని భర్త దగ్గరకు వస్తోంది. వారం రోజుల క్రితం మృత్యుంజయుడికి పెద్ద జబ్బు వచ్చింది. హిస్పిటల్లో చేరాడు. ఎక్స్రే తీసి కడుపులో ఏదో పుండు వుందనీ ఆపరేషన్ చెయ్యాలనీ అన్నారు డాక్టర్లు.

భర్త భోజనం చేసిన తర్వాత ఓ గంటసేపు కూర్చుని ఇంటికి బయల్దేరింది కుముదిని. వెడుతూ కొడుకును రమ్మన్నది. వాడు రానన్నాడు. సాయంత్రం వచ్చినప్పుడు తీసుకెళ్ళమన్నాడు భార్యతో. కుముదిని వెళ్ళిపోయింది. ఆ తర్వాత కొడుకుతో ముచ్చట్లలోకి దిగాడు తండ్రి. తను క్రితంరాత్రి చూసిన సినిమా గురించి చెప్పటం మొదలు పెట్టాడు కొడుకు.

రాత్రి నువ్వు ఎవరితో సినిమాకు వెళ్ళావని అడిగాడు తండ్రి ఆశ్చర్యంతో కొడుకుని. దాంతో అసలు విషయం బయటపడింది. ఆ క్రితంరాత్రి కుముదిని- పద్మరాజు వెంట రెండో ఆట సినిమాకు వెళ్ళిందని తెలిసింది.

పద్మరాజు- మృత్యుంజయుడి కొలీగ్. తరచు మృత్యుంజయుడి ఇంటికి వస్తుంటాడు. కుముదిని అతన్ని అన్నయ్యని పిలుస్తుంది. అదీకాక వాళ్ళిద్దరూ ఒక వూరివాళ్ళే.

చివరకు కుముదిని- పద్మరాజు ఆ రాత్రి ఒకే మంచంమీద పడుకున్నారని చెప్పాడు కొడుకు.

ఆపైన మృత్యుంజయుడు కొడుకుని ఏమీ అడగలేదు.

సాయంత్రం భార్య వచ్చినప్పుడు మామూలుగానే మాట్లాడాడు. వెళ్ళేటప్పుడు కొడుకును ఆమె వెంట పంపించాడు. ఆరాత్రి అతను భోజనం చెయ్యలేదు.

రాత్రి పన్నెండు గంటలవరకూ ఎట్టాగో గడిపాడు. తర్వాత మెల్లగా బయటకు వచ్చాడు. గేటుదగ్గర గూర్కా కునికిపాట్లు పడుతున్నాడు. గోడదూకి రోడ్డుమీదకు వచ్చాడు.

వచ్చిన ఓ నిముషానికి మృత్యుంజయుడు కోరుకున్నట్టుగానే నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద బాణంలా దూసుకువస్తున్న లారీ కనిపించింది.

*

(అక్టోబర్ 76 'స్వాతి' మాసపత్రిక)